ప్రజాశక్తి
మంగళవారం 20 డిసెంబర్ 2022
5
విజయనగరం



79 కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం

అబ్కారీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పరివర్తన 2.0 కార్యక్రమంలో భాగంగా జీవనోపాధి నిమిత్తం 79 కుటుంబాలకు వివిధ శాఖల ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందింది. వివిధ శాఖల ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.43.31 లక్షల విలువ గల చెక్కును పాత అబ్కారీ నేరస్థులకు కలెక్టర్ ఎ. సూర్యకుమారి సోమవారం అందజేశారు. స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో సెర్ఫ్, ఎక్సైజ్, డిఆర్‌డిఎ, సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పరివర్తన 2.0 కార్యక్రమం నిర్వహించారు. సారాయి, ఇతర మత్తు పానీయాలు తయారు చేసే వారంతా సాధారణ జీవితంలోకి రావాలని అవగాహన కల్పించారు. మొత్తం 121 మందిని గుర్తించి వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపుతూ వివిధ శాఖలు రుణ సదుపాయం కల్పించాయి. సంబంధిత చెక్కును అందజేసిన కలెక్టర్ మాట్లాడుతూ రుణ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన జీవనోపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ఫ్ ఎఎస్‌పి ఆస్మా పర్వీన్, డిఎస్‌పి శైలజా రాణి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ్ చక్రవర్తి, పశు సంవర్ధక జేడి రమణ పాల్గొన్నారు

పునాదుల్లోనే ప్రవేశాలా?

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలు ఇప్పట్లో జరిగే అవకాశాలు కనిపించడం లేదు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా గృహ ప్రవేశాలు పండగలా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో చాలా వరకు నిర్మాణాలు నేటికీ పూర్తి కాలేదు. మరికొన్ని చోట్ల అసలు లే అవుట్లకు రహదారులు గాని, విద్యుత్తు సదుపాయం గాని లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావడం లేదు.

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం నత్తనడకన సాగుతంది. విజయనగరం జిల్లాలో 78,158 ఇళ్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 25, 968 ఇళ్లు మంజూరయ్యాయి. నేటివరకు మన్యం జిల్లాలో 5018, విజయనగరం జిల్లాలో 7,457 మంది లబ్ధిదారులు ఇంతవరకు పునాదులు కూడా తీయలేదు. కొన్ని ఇళ్లు పునాదులు, మరికొన్ని లింటల్ లెవెల్‌లో నిలిచిపోయాయి. ఉన్నాయి. ప్రభుత్వం ఇచ్చిన డబ్బులు ఇళ్ల నిర్మాణాలకు సరిపోకపోవడం, కాలనీల్లో సౌకర్యాలు లేకపోవడం, పలుచోట్ల గ్రామాలకు, పట్టణాలకు దూరంగా ఉండడం వల్ల లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. ఈనేపథ్యంలో అధికారులు ప్రారంభించని ఇళ్ల స్థలాలను రద్దు చేస్తామని హెచ్చరించినప్పటికీ లబ్ధిదారులకు ఏమి చేయాలో పాలుపోవడం లేదు.



బొబ్బిలి.. పునాదులు నిర్మించి వదిలేసిన లబ్ధిదారులు

జగనన్న లేఅవుట్లలో కానరాని సౌకర్యాలు

రోడ్లూ లేవు.. విద్యుత్తు లైన్లూ లేవు

నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారులు

2574 ఇళ్లకు మూడే పూర్తి

బొబ్బిలి పట్టణంలో ఐటిఐ కాలనీ వద్ద జగనన్న లేఅవుట్‌లో 394 మందికి, రామన్నదొరవలస వద్ద రెండు లేఅవుట్లలో 2574 మందికి ఇళ్లు మంజూరు చేశారు. ఐటిఐ కాలనీ వద్ద 356 మందికి పైగా నిర్మాణాలు ప్రారంభించారు. 41 మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేశారు. రామన్నదొరవలస వద్ద రెండు లేఅవుట్లలో 1838 మంది పునాదులు నిర్మించారు. కానీ మూడు ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తిచేయడం గమనార్హం. రోడ్లు, నీటి సౌకర్యం లేకపోవడం, ప్రభుత్వమిచ్చే డబ్బులు సరిపడక పోవడం వల్ల నిర్మాణ పనులకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.

గూడెం మినహా అంతంత మాత్రమే

గుర్ల మండలంలో మొత్తం 297 ఇళ్లు మంజూరు చేశారు. ఇందులో ఇప్పటి వరకూ పూర్తయినవి కేవలం 35 ఇళ్లు మాత్రమే. మండలంలో 24 సచివాలయాల పరిధిలో 24 లేఅవుట్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటికీ ఒక్క గూడెం జంక్షన్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో మాత్రమే ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. మిగిలిన చోట్ల నిర్మాణాలు అంతగా జరగడంలేదు. 24 సచివాలయాల్లోనూ 297 ఇళ్లు మంజూరు చేశారు. వీటిలో ఇప్పటి వరకు 35 ఇళ మాత్రమే పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగాయని అధికారులు చెబుతున్నారు. మరో 167 నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని చెబుతున్నారు. వల్లాపురం, కెల్ల, ఎస్ఎస్ఆర్ పేట, కోటగండ్రేడు, పల్లిగండ్రేడు సచివాలయాల్లో కనీసం పనులు ప్రారంభం కాలేదు. కోటగండ్రేడు జగనన్న కాలనీకు స్థల సేకరణ స్థితిలోనే ఉంది.



గుర్ల మండలం కోటగండ్రేడులో ఇంతవరకూ ఒక్క ఇంటి నిర్మాణమూ ప్రారంభం కాని జగనన్న లేఅవుట్

మంజూరు వందల్లో.. పూర్తి పదుల్లో..

రామభద్రపురం మేజర్ పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్‌లో 342 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. వీటిలో 270 మంది వివిధ స్థాయిల్లో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. 52 ఇళ్లు పునాది స్థాయిలో ఉన్నాయి. 20 మంది మాత్రం ఇంకా నిర్మాణాలు చేపట్టలేదు. ఈ నెల 21న 45 ఇళ్లను ప్రారంభోత్సవాలకు సిద్ధం చేసినట్లు హౌసింగ్ ఎఇ సత్యారావునాయుడు తెలిపారు.



రామభద్రపురంలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు

ఎమ్మెల్యే స్వగ్రామంలోనే ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాలు

వీరఘట్టం మండలంలోని 38 పంచాయితీల్లో 19 లేఔట్లుగా ఏర్పాటు చేసి 1004 మందికి జగనన్న ఇళ్ల స్థలాలు పంపిణీ చేశారు. ఇందులో ఇప్పటి వరకూ ఆడారు, నర్సిపురం 2, వండువలో ఒక ఇల్లు నిర్మాణం ప్రారంభమయ్యాయి. సాక్ష్యాత్తు నియోజకవర్గ ఎమ్మెల్యే స్వగ్రామమైన వండవలో 64 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటికీ నిర్మాణాలు ప్రారంభం కాలేదు. పిఎంజిఆర్ కిందన మంజూరై ఇళ్లలో ఒకే ఒక ఇంటికి భూమి పూజ అయ్యింది. అలాగే మండలంలో పిఎంఎవైజి పథకం కింద 368 ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకూ 210 మంది లబ్ధిదారులకు కేవలం రూ.5వేలు చొప్పున ఖాతాలో జమ అయ్యాయి.



మామిడికాయల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మా ప్రభుత్వం రైతు పక్షపాతి

జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-తెర్లాం

తమ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని జగన్నాథవలస గ్రామంలో మామిడికాయల సేకరణ కేంద్రాన్ని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జెడ్‌పి చైర్మన్ మాట్లాడుతూ మెరకముడిదాం, తెర్లాం పరిసర ప్రాంతాల్లో మామిడి కాయలు ఎక్కువగా పండిస్తారని, వారికి అన్ని విధాలా సహకరించాలని ఉద్యాన శాఖాధికారులకు సూచించారు. శంబంగి మాట్లాడుతూ జిల్లాలో మొట్టమొదటి మ్యాంగో కలెక్షన్ సెంటర్ తన నియోజకవర్గంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సిఎం జన్మదినం సందర్భంగా గ్రామాల్లో రక్తదాన శిబిరాలు వంటి మంచి పనులు చెయ్యాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. జిల్లా ఉద్యానశాఖాధికారి మాట్లాడుతూ ఐదు నెలల కిందట శంకుస్థాపన చేశారని, త్వరితగతిన నిర్మాణం పూర్తిచేసి, అందుబాటులోకి తీసుకొచ్చారని తెలిపారు. వీటితో పాటు కూరగాయలు నిల్వ చేసుకోవడానికి 12లక్షల రూపాయలతో కోల్డ్‌స్టోరేజ్ మంజూరు చేశామన్నారు.

రోజుకు 10 టన్నుల మామిడికాయలు ఎగుమతి చేయగలమని స్థానిక నాయకులు జి.వెంకటరావు తెలిపారు. అంతకు ముందు మొక్కల్ని నాటారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి జి.లూర్దు, వైస్ ఎంపిపి పి.రమాదేవి, బొబ్బిలి మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటి గోపాలం, బొబ్బిలి మండల అధ్యక్షులు ఎస్. వేణుగోపాల నాయుడు, సర్పంచ్ జి.కుమారి. ఎస్. హేమలత తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో

రైతులకు న్యాయం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో ధాన్యం కొనుగోలులో మిల్లరు అదనపు కేజీలు లేదా డబ్బులు ఇవ్వనిదే ధాన్యాన్ని మిల్లులో దిగుమతి చెయ్యకుండా రైతులను ఇబ్బంది పెట్టడాన్ని అరికట్టాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను రైతు సంఘం జిల్లా నాయకులు ఎల్.ఆదినారాయణమూర్తి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.శ్రీనివాస్ కోరారు. సోమవారం స్పందనలో జెసికి వినతి అందజేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ఆర్‌బికెలో నమోదు చేసి మిల్లు అలాట్ చేసి రైతులను మిల్లుకు పంపిస్తున్నప్పటికీ అన్ లోడింగ్ చేయాలంటే అదనపు కేజీలు, లేదా డబ్బులు ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ధాన్యం టెస్టింగ్ చేసిన మిల్లర్లు తేమ, రద్దు, ముక్క అని ఏదో కారణం చెబుతూ ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. ఆర్‌బికె సిబ్బంది, వాలంటీర్, కస్టోడియం అధికారులు బాధ్యత తీసుకోవడం లేదన్నారు. ఆర్‌బికెల్లో అరకొరగా గోనె సంచులు ఇవ్వటం వల్ల రైతులకు అందడం లేదన్నారు. వర్షానికి తడిసిన ధాన్యం కొనుగోలు చేయటానికి తగిన ఏర్పాటు చేయాలని, ఈ క్రాప్‌లో నమోదు కాని, కౌలు రైతులుగా గుర్తించని కౌలుదారుల ధాన్యాన్ని కొనేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు

నెల్లిమర్ల బాలికల జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా నిర్వహించే సిఎం ప్రైజ్ మనీ టోర్నమెంట్ రాష్ట్రస్థాయి పోటీలకు నెల్లిమర్ల నియోజకవర్గం బాలికల జట్టు ఎంపికైంది. జట్టు సభ్యులను సోమవారం జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోను, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలోను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ అభినందించారు. క్రీడా దుస్తులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన పురస్కరించుకుని ఆటల పోటీలు, మేధావుల చర్చా గోష్టితో పాటు పలు సేవా కార్యక్రమాలు కూడా చేపడతామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో జరిగిన ఈ క్రీడా పోటీలలో జిల్లాకు చెందిన నెల్లిమర్ల నియోజకవర్గం జట్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఈనెల 21న విజయవాడ లో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు వీరు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గం పరిశీలకులు అందవరపు సూరిబాబు, జిల్లా కమిటీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పతివాడ శ్రీను, జాయింట్ సెక్రెటరీ కనకల రమేష్, కోచ్ సూర్యారావు, ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ కార్యదర్శి రమణ, క్రీడాకారులు పాల్గొన్నారు.

నేడు ఓటరు జాబితా పరిశీలకులు రాక

విజయనగరం : ఓటరు జాబితా పరిశీలకులు ఎ.బాబు మంగళవారం జిల్లాకు రానున్నారు. ఓటరు జాబితా సంక్షిప్త సవరణలపై జిల్లా కలెక్టర్, ఇఆర్ఒలు, ఎఇఆర్‌లతో మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 4.15 గంటలకు రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఓటరు జాబితా సవరణల కార్యక్రమంపై వినతులు, ఫిర్యాదులు, సలహాలు స్వీకరిస్తారు. 4.30 గంటలకు విశాఖ బయలుదేరి వెళతారని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు.



ర్యాలీగా వస్తున్న గురాన అయ్యలు, జనసేన కార్యకర్తలు

జనసైనికుడినై పనిచేస్తా

జనసేన నాయకులు గురాన అయ్యలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

పార్టీ అభివృద్ధికి జన సైనికుడినై పనిచేస్తానని యువనాయకుడు, వ్యాపార వేత్త గురాన అయ్యలు అన్నారు. పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలోచేరి, సోమవారం విజయనగరం చేరుకున్న ఆయనకు వై జంక్షన్ వద్ద జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఎత్తు బ్రిడ్జి మీదుగా రైల్వే స్టేషన్, ఎన్‌సిఎస్ రోడ్ మీదుగా, కన్యకా పరమేశ్వరీ కోవెల, గంటస్తంభం, పైడి తల్లమ్మ ఆలయం, కోట మీదుగా అంబేద్కర్ జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్దనున్న జిఎస్ఆర్ ఇంటర్నేషనల్ వరకు సాగింది. ఈ సందర్భంగా విలేకర్లతో అయ్యలు మాట్లాడుతూ జనహితమే జనసేన మతమని, రాష్ట్రంలో ప్రజలు బాగుండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

భూగర్భ జలాలు పుష్కలం

ఊట బావుల చుట్టూ ట్రెంచ్‌ల నిర్మాణం : కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో భూగర్భ జలాలు పుష్కలంగా, అతితక్కువ లోతులోనే అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. భూగర్భ జల అంచనా 2021-22 వివరాలను, సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన సమావేశంలో వెల్లడించారు. భూగర్భ జలాలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపైనా ఉందని అన్నారు. భూగర్భ జలాల విషయంలో మన జిల్లా రాష్ట్రంలోనే ఐదో స్థానంలో నిలిచిందని కలెక్టర్ చెప్పారు. సగటున కేవలం 1.99 మీటర్ల లోతులోనే మనకు భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇటీవల గత కొంతకాలంగా జిల్లాలో సమృద్ధిగా వర్షాలు కురవడం వల్ల, భూగర్భ జల మట్టం పెరిగిందని తెలిపారు. అ జిల్లాలో భూగర్భ జలాల పరిరక్షణకు, మరింతగా పెంచేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తక్షణమే మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా విరివిగా రీఛార్జి పిట్స్ ను, చెక్ డ్యాములను, ఇతర రీఛార్జి కట్టడాలను నిర్మించాలని సూచించారు. దీనికోసం అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువు గట్లు వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలను నాటాలని చెప్పారు. భూగర్భ జలశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ, భూగర్భ జల అంచనా 2021-22 ముఖ్య అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో సుమారు 1132 వాగులు, గెడ్డలు, నదులు తదితర నీటి ప్రవాహాలు ఉన్నాయని, వీటి ద్వారా కూడా నీరు భూగర్భ జలంగా మారుతోందని చెప్పారు. ఇష్టానుసారం బోరుబావులు తవ్వే అవకాశం లేదని, బోరు తవ్వేటప్పుడు తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేశారు. జిల్లాలో 150 మీటర్ల లోతుకు మించి బోరు తీయడానికి ఆమోదం లేదని తెలిపారు. సమావేశంలో సిపిఒ పి.బాలాజీ, జిల్లా వ్యవసాయాధికారి తారకరామారావు, పశు సంవర్ధక అధికారి డాక్టర్ వైవి రమణ, మత్స్యశాఖాధికారి నిర్మలాకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ ఉమాశంకర్, డ్వామా పీడీ జి.ఉమాపరమేశ్వరి, ఎపిఎంఐపి పీడీ పిఎన్‌వి లక్ష్మీనారాయణ, పరిశ్రమలశాఖ జిఎం పాపారావు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి



స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న డిఇ నర్మదా పట్నాయక్

మడ్డువలస నీరు విడుదల

ప్రజాశక్తి - వంగర

మండలంలోని గొర్లె శ్రీరాములునాయుడు మడ్డువలస ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని ప్రాజెక్టు వద్ద డిఇ నర్మదా పట్నాయక్ స్విచ్ ఆన్ చేసి సోమవారం దిగువకు సాగునీరు విడిచిపెట్టారు. ముందుగా 100కు క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. క్రమేపి దీనిని 400 క్యూసెక్కుల వరకు పెంచుతామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది రబి సీజన్‌కు సంబంధించి వంగరలో 996 ఎకరాలకు, రేగిడిలో 4074, సంతకవిటి 3016, శ్రీకాకుళం జిల్లా జి.సిగడం మండలంలో 1914 ఎకరాలకు మొత్తం పదివేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని అన్నారు. రైతులు ఈ నీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇలు అన్వేష్, అనిల్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎస్ఐ చర్చిలో 21న క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో వున్న సిఎస్ఐ చర్చిలో క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్టు జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి టి.చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా క్రిస్టియన్ మైనారిటీలకు బుధవారం సాయంత్రం 6 గంటలకు హై టీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎంఇడి నిరుద్యోగ అభ్యర్థుల ధర్నా



ధర్నా చేస్తున్న ఎంఇడి నిరుద్యోగ అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

దీర్ఘకాలంగా అపరిష్కతంగా ఉన్న ఎంఇడి క్వాలిఫైడ్ నిరుద్యోగ అభ్యర్థుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ఎంఇడి నిరుద్యోగ అభ్యర్థుల అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై. త్రినాధరావు మాట్లాడుతూ ఎంఇడి అర్హత కలిగిన సుమారు పదివేల మంది నిరుద్యోగులు రాష్ట్రంలో ఉన్నారని పేర్కొన్నారు. గత 20 ఏళ్లుగా ప్రైవేట్ కాలేజీలలో వేలాది మందికి శిక్షణ ఇచ్చి ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దిన తమకు ప్రభుత్వ ఉద్యోగాలు రాక పోవడంతో తమ కుటుంబాలు ఉపాధి లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డబుల్ పీజీలు పూర్తిచేసి, ప్రైవేటు ఉపాధ్యాయ కళాశాలలో ఏళ్ల తరబడి పనిచేసిన అనుభవం ఉన్నప్పటికీ తమకు ప్రభుత్వ ఉద్యోగాలలో నియామకాలు లేక, ఉద్యోగ అర్హతలు ఉన్నప్పటికీ వయసు దాటిపోయి ఆర్థికంగా చితికిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఇఓ పోస్టుల నియామకాలు చేపట్టాలని, ప్రభుత్వ డైట్, బిఇడి కళాశాలల్లో లెక్చరర్ల నియామకాలు చేపట్టాలని, సచివాలయాల్లో ఎడ్యుకేషనల్ సహాయకులుగా తమను నియమించాలని, ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితిని పెంచాలని, ప్రతి ఏడాది రేటిఫికేసన్ జరిగేలా చర్యలు చేపట్టాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ నియామకాల లో ప్రాధాన్యత కల్పించాలని, విశ్వవిద్యాలయాలలో ఉన్నత అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని తదితర డిమాండ్ చేశారు. అనంతరం స్పందనలో కలెక్టర్ సూర్యకుమారికి వినతి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. వి.సత్యనారాయణ, ప్రతినిధులు బెల్లాపు సత్యనారాయణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు


ప్రజాశక్తి- రేగిడి

గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే బకాయి వేతనాలు చెల్లించకపోతే సమ్మెకు సిద్ధం కావాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామ్మూర్తి నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్లకు 9 నెలలు వేతనం బకాయి పడిందన్నారు. గౌరవ వేతనం పేరుతో ఎటువంటి కనీస వేతనం అమలు చేయకుండా కనీస సౌకర్యాలు కల్పించకుండా తీవ్రంగా దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు అమలు చేయకుండా దోపిడీ చేయడం సరైంది కాదన్నారు. ఉద్యోగ భద్రత కల్పించి, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, కార్మికులకు ప్రభుత్వమే గుర్తింపు కార్డు యూనిఫార్మ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావుకు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు డి.సత్యం, వై.రమేష్, కె.పెంటయ్య, ఎల్. లక్ష్మము, కె.పాపయ్య, సత్యం, కె.సత్యం ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభ విజయవంతానికి

మున్సిపల్ కార్మికుల ప్రచారం

ప్రజాశక్తి-బొబ్బిలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ 14వ రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు. సోమవారం పట్టణంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ అనేక హామీలిచ్చి విస్మరించారన్నారు. వెంటనే ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనాలు అమలు చేయాలని, రక్షణ పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శి జి.గౌరి, జి.రామారావు, కోశాధికారి ఎం.ప్రసాద్, బి.వెంకటి పాల్గొన్నారు.

అనిల్ కుమార్‌కు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల న్యూజిలాండ్ లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచి నాలుగు బంగారు పతకాలు సాధించిన బోదంకి అనిల్ కుమార్‌ను జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎ. సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అభినందించారు. ఇలాంటి విజయాలు భవిష్యత్తులో మరిన్ని అందుకోవాలని శుభాకాంక్షలు తెలిపారు. అనిల్ కుమార్ నవంబరు నుంచి డిసెంబర్ వరకు న్యూజిలాండ్ లో జరిగిన క్రీడల్లో భారతదేశం తరపున పాల్గొని పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 83 కేజీల విభాగంలో నాలుగు బంగారు పథకాలు సాధించాడు. సోమవారం స్పందన కార్యక్రమంలో అనిల్ కుమార్, కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులను మార్యదపూర్వకంగా కలిశాడు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ దుశ్శాలువా కప్పి సత్కరించారు.

24న జెడ్‌పి బడ్జెట్ సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ప్రజాపరిషత్ బడ్జెట్ సమావేశం ఈనెల 24న ఉదయం 10.30 గంటలకు జరుగుతుందని సిఇఒ డాక్టర్ ఎం.అశోక్ కుమార్ తెలిపారు. 2023-24 సంవత్సరానికి అంచనా బడ్జెట్ ఆమోదించడంతో పాటు, 2022-23 సంవత్సరానికి సబంధించి సవరణ బడ్జెట్ ఆమోదం కోసం ఈ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. దీంతో పాటు 1వ స్థాయీ సంఘ సమావేశం కూడా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి డిఎస్‌పి శ్రీనివాసరావు

స్పందనలో ఫిర్యాదుల స్వీకరణ

విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు వినతులు స్వీకరించారు. ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్యలు తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడారు. కార్యక్రమంలో సిఐలు జె.మురళి, రుద్రశేఖర్, జి.రాంబాబు, ఎస్ఐ వాసుదేవ్ పాల్గొన్నారు.




కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

జిఒ 52ను రద్దుచేయాలి

పార్వతీపురం పట్టణంలో భారీ ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం కలెక్టరేట్

బోయ, వాల్మీకులను గిరిజన జాబితాలో చేర్చొద్దని, జీవో 52ను రద్దు చేయాలని, గిరిజన సమస్యలను పరిష్కరించి వెనకబడిన గిరిజనులకు న్యాయం చేయాలని ఆదివాసీ ఐక్య సంఘాల కార్యసాధన సంఘాల ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. బోయ, వాల్మీకులను చేర్చొద్దని, జీవో 52ను రద్దు చేయాలని, గిరిజనులకు అన్యాయం చేయొద్దంటూ నినాదాలు ఇస్తూ ర్యాలీలో నినాదాలు చేశారు. గిరిజనుల నినాదాలతో పార్వతీపురం పట్టణం మారుమోగిపోగా, గిరిజన సాంప్రదాయ డప్పులతో కలెక్టరేట్ వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమం ఉద్దేశించి ఆదివాసీ ఐక్య కార్యసాధన సంఘాల చైర్మన్ నిమ్మక జయరాజు మాట్లాడుతూ బోయ, వాల్మీకులను గిరిజనులు జాబితాలోచేర్చడాన్ని గిరిజన అంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. తక్షణమే 52 జీవోను వెనక్కి తీసుకోవాలని, కొత్తగా ఏర్పాటు చేసిన కమిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జెఎసి వైస్ ప్రెసిడెంట్ గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజన ఐక్యతను చాటుతూ వారి హక్కుల పరిరక్షణకు నేడు గిరిజనులంతా ఏకత్రాటిపై నిలిచి ముందుకు వచ్చారని అన్నారు. ఎస్‌టి సబ్ ప్లాన్ నిధులు అందడం లేదని ప్రశ్నిస్తే నవరత్నాలలో కల్పిస్తున్నామని ప్రభుత్వం చెప్పడం విడ్డూరమన్నారు. అలాగే ఐటిడిఎ సేవలను పూర్తిస్థాయిలో నిర్వహించాలన్నారు. గిరిజనులకు సబ్సిడీ రుణాలు, పనిముట్లు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన శాఖ మంత్రి గిరిజన సమస్యలను ప్రభుత్వ దష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కె.లక్ష్మణమూర్తి మాట్లాడుతూ సుమారు 33 తెగలు గల గిరిజనులు సుమారు 30 లక్షలుంటే, బోయ, వాల్మీకులు మాత్రమే 40 లక్షలు ఉన్నారని, దీనివల్ల గిరిజనులు తన హక్కులను కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. దీన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. అనంతరం గిరిజన సంఘ నాయకులు ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. పిఒ మాట్లాడుతూ గిరిజన సమస్యల పరిష్కారానికి తనవంతు ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జిల్లాలోని అన్ని గిరిజన సంఘాల నాయకులు, గిరిజన ఉద్యోగులు, రైతులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న, డిఇ గోవిందరావు

జెజెఎం నిధులు రూ.90 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-వేపాడ

నియోజకవర్గానికి జల జీవన్ మిషన్ నిధులు రూ.90 కోట్లు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ గోవిందరావు తెలిపారు. జెజెఎం నిధులతో మండలంలోని బొద్దాం, సోంపురం గ్రామాల్లో చేపడుతున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలో ఇంటింటికీ కుళాయిలను ఏర్పాటు చేస్తున్నట్లు డిఇ వెల్లడించారు. కార్యక్రమంలో డిఇఇ పైడిరాజు జెఇ దేవి, వర్క్ఇన్‌స్పెక్టర్ కామేష్, తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగుకు మంచి అవకాశం

ప్రజాశక్తి-కొత్తవలస

రబీ సాగుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని ఎపిఎం వెంకట రమణ తెలిపారు. మండలంలోని చీడువలస గ్రామంలో మేడపురెడ్డి రాములమ్మ పొలంలో మినుము పంటలో సోమవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ, సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో ఐసిఆర్‌పి రాములమ్మ ప్రకృతి సాగు పద్ధతిలో సాగుచేస్తున్నారు. కార్యక్రమంలో ఎం.టి.కోటిబాబు, సింహాచలం, ఎ. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కాలపరిమితి దాటిన వాహనాలు వేలం

ప్రజాశక్తి- విజయనగరం కోట

జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో కాల పరిమితి దాటిన 21 వాహనాలను ఇ- కొనుగోలు పోర్టల్ ద్వారా వేలం పాట నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒ ఎస్‌వి రమణ కుమారి తెలిపారు. సోమవారం తమ కార్యాలయంలో కమిటీ సభ్యులతో సమావేశం జరిగినది. గుర్తింపు పొందిన వేలం పాట దారులు పాల్గొన వచ్చునని తెలిపారు. సమావేశంలో సర్వీసు ఇంజినీర్ కెఎస్ఎస్ బాలాజీ, ఎటిఒ డి.సురేష్, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ బి.అప్పలనాయుడు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.రవిశంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయండి

ప్రజాశక్తి - వంగర

ఆరోగ్య సిబ్బంది అంతా అంకిత భావంతో పనిచేయాలని ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. ముందుగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న నాడు నేడు పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయని వైద్యాధికారులు వివరించడంతో వెంటనే స్పందించిన ఎంపిపి కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు వేగవంతం అయ్యేవిధంగా చర్యలు చేపడతామన్నారు. విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే చర్యలు చేపడతామన్నారు. ఆరోగ్య కేంద్రం వద్ద ఎంపిపి నిధులతో సమావేశ మందిరం నిర్మించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైద్యాధికారులు సుస్మిత, జ్యోతి, సి హెచ్‌ఒ రామారావు, వంగర ఎంపిటిసి కనగల పద్మ, మగ్గూరు సర్పంచ్ పోలిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌సిల వర్గీకరణకు సమిష్టి కృషి

ప్రజాశక్తి-బాడంగి

ఎస్‌సిల వర్గీకరణే లక్ష్యంగా సమిష్టి కృషి చేసి, ఫలాలు పొందేందుకు ప్రతిఒక్కరూ కలిసి ముందుకు రావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు కోరారు. బాడంగిలో సర్పంచ్ కండి రమేష్ ఆధ్వర్యాన నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 28 ఏళ్లుగా వర్గీకరణకు అహర్నిశలు కృషిచేసిన మందకృష్ణ మాదిగ సేవలను అందరూ గుర్తించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు బోగి శ్రీను, బోగి సురేష్, పులి డేవిడ్, సంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

పినతాడివాడలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పినతాడివాడలో పారిశుధ్యం పనులను సర్పంచ్ లంక లక్ష్మణరావు ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. స్థానిక సచివాలయం కార్యదర్శి ఎం. జగదీశ్వరరావు పర్యవేక్షణలో గ్రామంలోని కాలువల్లో పూడికపోయిన చెత్తా చెదారాలను మట్టిను తొలగించారు. వాడుక నీరు కాలువల ద్వారా వెళ్లేటట్టు శుభ్రపరిచి బ్లీచింగు చల్లి నీరు నిల్వలేకుండా తొలగించారు. ఇంటింటికి తిరిగి పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రపరచాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



కాలువల్లో పూడిక తొలగిస్తున్న కార్మికులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస -1 రైతు భరోసా కేంద్రం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలని తెలిపారు. దళారుల చేతిలో రైతులు మోసపోకుండా ఉంటారని భావించి, ప్రభుత్వం ఆర్‌బికెల ద్వారా ధాన్యం సేకరిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, కొత్తవలస పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, వైసిపి మండల అధ్యక్షులు ఒబ్బిన నాయుడు, తుమ్మికాపల్లి సర్పంచ్ విరోతి కొండలరావు, తహశీల్దార్ ఎం.ప్రసాదరావు, ఎంపిడిఒ వై.పద్మజ, సిఎస్ డిటి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటిరేగ : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని కొప్పెర్ల రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా, దళారీ వ్యవస్థ నిర్మూలన కోసమే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికే, రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. రైతులెవరూ దళారులను ఆశ్రయించి మోసపోవొద్దని అన్నారు. అధికార యంత్రాంగం ధాన్యం కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి మహంతి కళ్యాణి, మహంతి శ్రీనివాసరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, మహంతి జనార్ధన రావు, వైస్ ఎంపిపిలు అల్లాడ రమేష్, సత్యన్నారాయణ రాజు, మండల వ్యవసాయాధికారి నీలిమ తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శంబంగి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎంఎంసి చైర్మన్ బి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఏదో ఒక పథకం ప్రతి ఇంటికీ అందుతుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలోని 30వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు అమలు తీరుపై ఆరాతీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారని ఆయన తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు కె.రాజేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాల్ నాయుడు, వైస్ ఛైర్మన్ చెలికాని మురళీకృష్ణ, ఇంటి గోపాలరావు, కౌన్సిలర్ వాడపల్లి వనజ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఎంఎంసి చైర్మన్

బొబ్బిలి ఎఎంసి చైర్మన్‌గా నియమితులైన బొమ్మి శ్రీనివాసరావు.. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేతోపాటు వైసిపి నియోజకవర్గ పరిశీలకులు కె.రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా మున్సిపాలిటీలో 30వ వార్డులో సోమవారం మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు, ఇంటి గోపాలరావు, కౌన్సిలర్లు వాడపల్లి వనజ కుమారి, బొత్స రమణమ్మ, వైసిపి నాయకులు వాడపల్లి మనోజ్, రేజేటి ఈశ్వరరావు, మండల జనార్దన్, దిబ్బ గోపి, తుట్ట తిరుపతి పాల్గొన్నారు.

రైతులకు తానా చేయూత

ప్రజాశక్తి-వేపాడ

తానా ఆధ్వర్యాన విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి గొంప కృష్ణ తెలిపారు. సోమవారం వేపాడలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యాన రైతులకు రక్షణ పరికరాలు, వ్యవసాయ సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేపాడ మండలంలో 50 పురుగుల మందులు పిచికారి మిషన్లు, 300 రక్షణ కవచాలు సంబంధించిన కిట్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. జన్మభూమి స్వచ్ఛంద సంస్థ ద్వారా మండల పరిధిలో హాస్పిటల్ నిర్మిస్తామని హామీనిచ్చారు. కృష్ణరాయుడుపేట పంచాయతీలోని ఎకెజిపాలెం తన స్వగ్రామమని, తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారి కష్టాలు తెలుసు కాబట్టే రైతులకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రజాసేవ చేయాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. అనంతరం టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు మాట్లాడుతూ తనపై కొంతమంది తప్పుడు ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని తెలిపారు. తన పాతికేళ్ల రాజకీయ జీవితంలో ఏ ఒక్కరి దగ్గరైనా ఒక్క రూపాయి తీసుకున్నట్లు రుజువు చేయగలరా? అని సవాల్ చేశారు. టిడిపి కోసం కష్టపడి పనిచేయడమే ధ్యేయమని, తప్పుడు ఆరోపణలు మానుకుని చేతనైతే పార్టీకి సేవలు అందించాలని హితవుపలికారు. అనంతరం తానా మాజీ అధ్యక్షులకు సన్మానించారు. కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షులు జయరామరాజు, గంగాధర్ చౌదరి, టిడిపి జామి, కొత్తవలస మండలాల అధ్యక్షులు నౌడు రవికుమార్, గొరపల్లి రాము, నాయకులు రాయవరపు చంద్రశేఖర్, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, నాయకులు సేనాపతి గణేష్, ముక్క రామకృష్ణ, జె.పెద్దరామునాయుడు, గొర్ల నాగరాజు పాల్గొన్నారు.



రైతులకు కిట్లను అందజేస్తున్న తానా సభ్యులు, నాయకులు గొంప వెంకటరావు

కార్యకర్తలు తరలిరావాలి

చంద్రబాబు పర్యటనపై గ్రామాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- రేగిడి

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 22న రాజాం నియోజకవర్గం వస్తున్న సందర్భంగా నియోజకవర్గంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు గ్రామాలలో ప్రతి ఇంటి నుండి తరలివచ్చి పర్యటన విజయవంతం చేయాలని రాష్ట్ర అధికార ప్రతినిధి కావలి గ్రీష్మ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం రేగిడి మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణ నాయుడుతో కలిసి ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజాంలో చంద్రబాబు నాయుడు పర్యటనపై నియోజకవర్గంలో ఇప్పటికే విస్తృత ప్రచారం చేశామన్నారు. ఇప్పటికే కార్యకర్తల రాకపోకలపై అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో ఒబిసి నాయకులు ప్రత్యేకంగా హాజరవ్వాలని ఆమె పిలుపునిచ్చారు.



టిడిపి నాయకులతో మాట్లాడుతున్న రాష్ట్ర అధికార ప్రతినిధి కావలి గ్రీష్మ ప్రసాద్

రాజాం టిక్కెట్‌పై సహకరించాలి


రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాజాం నియోజకవర్గ అసెంబ్లీ టికెట్ ఆసిస్తున్న తనకు సహకరించాలని రేగిడి మాజీ ఎంపిపి కిమిడి రామకృష్ణంనాయుడు, కిమిడి వినయ్ కుమార్‌లను గ్రీష్మ కోరారు. దీని కోసం కిమిడి వర్గీయులు చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అందుకు కిమిడి రామకృష్ణనాయుడు కూడా ఆమెకు టికెట్ ఇప్పించడంపై పై విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిస్తోంది.

మెరకముడిదాం: ఈ నెల 22 జిల్లాలో రాజాం నియోజకవర్గంలో జరగనున్న చంద్రబాబు 'ఇదేమి కర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టిడిపి మండల పార్టీ అధ్యక్షులు, మాజీ ఎంపిపి తాడ్డి సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం మండలంలోని ఉత్తరావిల్లి గ్రామంలో టిడిపి కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు మండల రమణ, మోహనరావు, పిన్నింటి సన్యాసినాయుడు, పెందుర్తి సింహాచలం, సుంకరి సత్యనారాయణ, రెడ్డి ఆనంద్, రెడ్డి పైడన్న, పతివాడ పరశురామ్, గొర్లె రామకృష్ణ, కెంగువ ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌లో భోగాపురం విన్నర్

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని పూసపాటిరేగ లో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో భోగాపురం గ్రామానికి చెందిన క్రీడా జట్లే విన్నర్ గా రన్నర్‌గా నిలిచాయి. ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ పోటీలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు ప్రారంభించారు. నియోజకవర్గం వ్యాప్తంగా 18జట్లు పాల్గొనగా భోగాపురం - బి జట్టు ప్రథమ స్థానంలో, భోగాపురం -ఎ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటాయి. విజేతలకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నారని మండల వైసిపి నాయకులు మహంతి శ్రీనివాసరావు తెలిపారు.



పూసపాటిరేగ.. పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

క్రీడలు, ముగ్గుల పోటీలు

గరివిడి : సిఎం జగన్మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని సోమవారం చీపురపల్లి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వైసిపి మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో ముగ్గులు పోటీలను నిర్వహించారు. మూడు రోజులు పాటు నిర్వహించనున్న వేడుకల్లో భాగంగా మొదటి రోజు సోమవారం ఉదయం మహిళలతో రంగవల్లి, మ్యూజికల్ చైర్, హౌసీ, లెమన్ స్పూన్ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ దన్నాన జనార్దన్, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ప్రారంభించారు. ఈ పోటీల్లో గెలిపొందిన వారికి ఈ నెల 21 బహుమతులు ప్రదానంచ చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ పతివాడ రాజారావు, కనకమహాలక్ష్మి చైర్మన్ ఇప్పిలి గోవింద, ఎంపిటిసిలు గిరిడి రామదాసు, కోరుకొండ దాలయ్య, చందక శ్రీను, బాణన రమణ, బైరెడ్డి లక్ష్మణరావు, పాండ్రంకి వాసు, కరణం ఆది, సూరు దుర్గారావు, ఇప్పిలి కృష్ణ, మార్బుల్ శేఖర్, మజ్జి శంకర్, ప్రభాత్, శేఖర్ గుప్తా, అడ్డురి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

3,912 టన్నుల ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఈ ఏడాది ఇప్పటికి రైతుల నుండి ధాన్యం కొనుగోలులో మండలం జిల్లా స్థాయిలోనే ప్రథమ స్థానంలో ఉందని ఎఒ శ్రావణి తేజ, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పిన్నింటి రామారావు తెలిపారు. మండలంలోని ఇప్పటి వరకు 354మంది రైతులు నుండి 3,912 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. 18 రైతు భరోసా కేంద్రాలతో పాటు చినబంటుపల్లి, మెరకముడిదాం, సోమలింగాపురం, శాతంవలస సొసైటీ పరిధిలో మండల అధికారులు నిరంతర పర్యవేక్షణలతో రైతులు నుండి కొనుగోలు వేగవంతంగా జరుగుతోందన్నారు. ఏ ఒక్క రైతుకు నష్టం జరగ కుండా, దలారీల చేతులో రైతులు మోస పోకుండా ప్రతి ధాన్యపు గింజ ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా రైతుకు అన్యాయం జరిగితే వెంటనే పౌర సరఫరా అధికారులను సంప్రదించాలని తెలిపారు. సంక్రాంతి పండగలోపే మండలంలోని ప్రతి రైతునుండి పూర్తి స్థాయిలో ధాన్యం సేకరణ చేసి తీరాలనే జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశాలు అనుసరించి అధికారులందరు సమన్వయంతో పనిచేస్తున్నామని వారు చెప్పారు.

బధిర క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

ప్రజాశక్తి-విజయనగరం

ఐదో స్పోర్ట్స్ అథారిటీ సీనియర్ బధిరుల ఛాంపియన్ షిప్ పోటీలలో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లాకు చెందిన 21 మంది బధిర విద్యార్థులను జిల్లా కలెక్టర్ ఎ. సూర్యకుమారి అభినందించారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు ఏలూరు వేదికగా జరిగిన క్రీడల్లో జిల్లాకు చెందిన బధిర క్రీడాకారులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. ఈసందర్భంగా కలెక్టర్ అభినందించారు.

బధిర క్రీడాకారులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి ఈశ్వర్ కౌశిక్ అభినందించారు. కృషి, పట్టుదల ఉంటే ఎంతటి విజయాన్నైనా సాధించవచ్చనని అన్నారు. ఎంతోమంది వికలాంగులు అద్భుత విజయాలు సాధించి, భావితరాలకు స్ఫూర్తి శిఖరాలుగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కాళ్ళ సూరిబాబు, అసోసియేషన్ సహాయ కార్యదర్శి కనకల రమేష్ తదితరులు ఉన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

ప్రతిభ కనబరిచిన బధిర క్రీడాకారులను గురుకులాల జిల్లా కో - ఆర్డినేటర్ బి. చంద్రావతి అభినందిస్తూ రూ.3వేల ఆర్థిక సాయం అందజేశారు. దీనిపై క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.



శశిభూషణరావును సన్మానిస్తున్న వాగ్దేవి విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు

సమాజాభివృద్ధిలో యువతే కీలకం

ప్రజాశక్తి-కొత్తవలస

సమాజాభివృద్ధిలో యువత పాత్రే కీలకమని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. సోమవారం స్థానిక వాగ్దేవి విద్యాసంస్థల్లో మానవాభివృద్ధిలో యువశక్తి పాత్రపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంలో యువత సంఖ్య అధికంగా ఉందని, అలాంటి మానవ వనరులు ఏ దేశానికీ లేవని చెప్పారు. నేటి యాంత్రిక యుగంలో మన ఆలోచన పరిధిని విస్తృత పరిచి ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. అనంతరం శశిభూషణరావును కళాశాల యాజమాన్య ప్రతినిధులు, సిబ్బంది సత్కరించారు. వాగ్దేవి విద్యాసంస్థల అధినేత కె.మహేశ్వరరావు జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

ఆర్‌బికెల పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వేపాడ, వల్లంపూడి, జాకేరు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను సోమవారం ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పరిశీలించారు. రైతుల వద్దనుంచి సేకరిస్తున్న ధాన్యం వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శులు, విఎఎలు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం పంపిణీ

రెడ్‌క్రాస్ నేతృత్వంలో దాతల సహాయం

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని 63 మంది క్షయవ్యాధి గ్రస్తులకు ఆరు నెలలపాటు పౌష్టికాహారం సరఫరాకు ఇద్దరు దాతలు ముందుకు వచ్చారు. రెడ్‌క్రాస్ నేతృత్వంలో ఒక్కో రోగికి ఆరు నెలలపాటు పౌష్టికాహారం అందించే కార్యక్రమాన్ని సోమవారం రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో చైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా.జె.రామేశ్వరి ప్రభు ప్రారంభించారు. నగరానికి చెందిన ఎన్‌సిఎస్ ఛారిటబుల్ ట్రస్టు తరపున నారాయణం శ్రీనివాస్, మరో ప్రముఖుడు మేకా కాశీవిశ్వేశ్వరుడు 63 మంది రోగులకు ఒక్కో రోగికి నెలకు రూ.700 వంతున ఆరు నెలల కాలానికి రూ.4200 పౌష్టికాహారం సరఫరాకు ఆర్థిక సహాయం అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నిక్షయ కార్యక్రమం కింద క్షయ రోగులకు కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పౌష్టికాహారం సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టామని రామేశ్వరి ప్రభు తెలిపారు. రోగులు సకాలంలో క్రమం తప్పకుండా వైద్యులు సూచించిన రీతిలో మందులు తీసుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఈ వ్యాధిని నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. టిబి రోగులకు సహాయ పడేందుకు పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ కె.ఆర్.డి.ప్రసాదరావు చెప్పారు. పౌష్టికాహార కిట్‌లో 3 కిలోల రాగి పౌడర్, ఒకటిన్నర కిలోల కందిపప్పు, 1 కిలో శనగపలుకులు, అరలీటరు వంటనూనె అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమం లో దాతలు మేకా కాశీ విశ్వేశ్వరుడు, ఎన్.సి.ఎస్.ట్రస్టు ప్రతినిధి నారాయణం సీతారామయ్య, సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్, రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.సత్యం, కోశాధికారి టి.రామారావు, రెడ్ క్రాస్ శాశ్వత సభ్యులు శంకరరావు, రెడ్ క్రాస్, క్షయ నిర్మూలన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



క్షయరోగికి పౌష్టికాహార సరుకులు అందిస్తున్న ఐఅండ్‌పిఆర్ ఎడి రమేష్

సిఎం జన్మదినం సందర్భంగా

విస్తృతంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 21న నియోజకవర్గంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షులు ఆశపు వేణు, మండల పార్టీ అధ్యక్షులు నడిపే న శ్రీనివాసరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు సంగం రెడ్డి బంగారు నాయుడు తెలిపారు. సోమవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 21న ఉదయం నగరంలోని పలు ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. పలు సేవా కార్యక్రమాలు చేపడతామని వివరించారు. సమావేశంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు, జోనల్ ఇన్చార్జులు ఎస్ వి వి రాజేష్, ముద్దాడ మధు, బొద్దాన అప్పారావు, ఈశ్వర్ కౌశిక్, రెడ్డి గురుమూర్తి, జీవి రంగారావు లతో పాటు లెంక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపిపి అంబళ్ల సుధారాణి తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం సిఎం పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సతివాడలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. 21న పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో జగన్ పేరిట ప్రత్యేక పూజలు చేపడతామన్నారు. అనంతరం స్థానిక సచివాలయంలో కేకు కటింగ్ ఉంటుదన్నారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న కార్యక్రమాలకు అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, నాయకులు పాల్గొనాలని తెలిపారు.